www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 17 మార్చి 2025

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



120 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం


ఉచితంగా మందుల అందజేస్తున్న సర్పంచ్

ఎన్.కొత్తపల్లి పంచాయతీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అమలాపురం రవి ఇఎన్‌టి ఎండోస్కోప్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శిబిరాన్ని సర్పంచ్ కుంచే చిట్టి కుమారి ప్రారంభిం చారు. చెవి, ముక్కు, గొంతు వైద్యులు కాశిన రవి రోగులను పరీక్షించి ఉచితంగా మందుల అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కుంచే చిన్ని,ఆంగాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పది పరీక్షలు ప్రారంభం

- అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థి భవిష్యత్తుకు పదో తరగతి తొలి మెట్టు. ఈ తరుణంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అదికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. విద్యార్థులను 8.45కు కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభమై మధ్యాహ్నం 12.45 గంటల వరకూ నిర్వహించనున్నారు. పరీక్షా నిర్దేశిత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించేది లేదని ఇప్పటికే విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి హాజరయ్యేలా తల్లిదండ్రులు, విద్యార్థులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. అదే విధంగా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.


కొత్తపేటలో టెన్త్ పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమల్లో ఉంటుందని ఇప్పటికే అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు గుంపులుగా ఉండేందుకు అవకాశం లేదు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులు మూసివేయాలని అధికారులు ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఇన్విజిలేటర్లలో స్కూల్ అసిస్టెంట్ల నియామకానికి ప్రాధాన్యమిచ్చారు. సరిపోని పక్షంలో ఎస్‌జిటిలతోపాటు ఇతరుల నియామకాన్ని చేపట్టారు. సబ్జెక్టు టీచర్లను మాత్రం వారి పరీక్ష రోజు రిలీవ్ చేస్తారు. ఈసారి పరీక్షల్లో స్కూల్ అసిస్టెంట్ల నియామకానికి ప్రాధాన్యమిచ్చారు. స్కూల్ అసిస్టెంట్లు సరిపోని పక్షంలో ఎస్‌జిటిలతో పాటు ఇతరుల నియామకాన్ని చేపట్టారు. సబ్జెక్టు టీచర్లను వారి పరీక్ష నిర్వహణ రోజు రిలీవ్ చేస్తారు. పరీక్షలకు సంబంధించి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 3 వేలకు పైగా ఇన్విజిలేటర్లను నియమించారు.

మెడికల్ కిట్లు సిద్ధం

పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్య సేవలందేలా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన వైద్య సిబ్బందితోపాటు మందులను వైద్యశాల ఏర్పాటు చేసింది. పరీక్షా కేంద్రంలో ఎఎన్ఎంతోపాటు ఆశా వర్కర్‌ను నియమించి ప్రథమ చికిత్సకు అవసరమైన. మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. పరీక్షా కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌లుగా ప్రకటించారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేకమైన నిఘా ఏర్పాట్లు చేశారు. మాస్ కాపీయింగ్‌ను నిరోధించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. స్క్వాడ్స్ ప్రతిరోజూ ఆయా కేంద్రాలను తనిఖీ చేస్తాయి. పరీక్షల విధుల్లో ఉన్నవారు మినహా బయటి వ్యక్తులను కేంద్రాల్లోకి అనుమతించరు. వికలాంగులకు అవసరమైతే స్క్రయిబ్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

విద్యార్థులకు సూచనలు

పరీక్షలు రాసే విద్యార్థులంతా ఉదయం 8.30 గంటలకల్లా ఖచ్చితంగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 8.45 నుంచి 8:30 వరకు మాత్రమే విద్యార్థులను పరీక్షా కేంద్రాలలోకి అనుమతి స్తారు. తరువాత గేట్లు మూసి వేస్తారు. రోల్ నెంబర్ ఆధారంగా విద్యార్థి తనకు కేటాయించిన సీట్లో కూర్చున్న తర్వాత ఇన్విజిలేటర్ బార్ కోడింగ్, ఒఎంఆర్ షీట్, ప్రశ్నపత్రం, ఆన్సర్ బుక్‌లెట్ ఇస్తారు. తర్వాత ఒఎంఆర్ షీట్ పూరించే విధానంపై ఇన్విజిలేటర్ ఇచ్చే సూచనలు పాటిస్తూ జాగ్రత్తలు పాటించాలి. దానిపై అనవసరమైన గీతలు, రాతలు రాయకూడదు. ఇన్విజిలేటర్ ఇచ్చిన ఒఎంఆర్ షీట్‌పై విద్యార్థి పేరు, పరీక్షకు సంబంధించిన వివరాలు సక్రమంగా ఉన్నవీ, లేనివీ నిర్ధారించుకోవాలి. 10:30 గంటలకు పరీక్ష ప్రారంభమైన తర్వాత మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్ష ముగిసే వరకూ విద్యార్థులను బయటకు వెళ్లనివ్వరు. తూర్పు గోదావరి జిల్లాలో 25, 723 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షా కేంద్రాలు 134, ఉన్నాయని అధికారులు తెలిపారు.

సజావుగా నిర్వహించేందుకు చర్యలు : డిఇఒ

అమలాపురం: డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 1 వరకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డిఇఒ షేక్ సలీం బాషా అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ విధించాలని చెప్పారు. జిరాక్స్, నెట్ సెంటర్లన్నీ మూసి ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థిని, విద్యార్థులకు పరీక్షా కేంద్రాలలో అన్ని కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు వైద్య శిబిరాలు ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఒఆర్ఎస్ ప్యాకెట్లు పెయిన్ కిల్లర్ ఔషధాలతో నిర్వహించాలన్నారు. విద్యుత్ శాఖ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. పోలీస్ శాఖ ప్రశ్నావళి జవాబు పత్రాలు తరలిం పులో భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే తాసిల్దారు వారి సూచనల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని ఆదేశించారు. ఆర్‌టిసి వారు హాల్ టికెట్ చూపిన విద్యార్థులను ఉచితంగా బస్సులలో ప్రయాణించే ఏర్పాటు చేయాలని పరీక్షా కేంద్రాల రూట్లు లో బస్సులు నడపాలని ఆదేశించారు. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను పర్యవేక్షణ కొరకు నియ మించామన్నారు. సమస్యాత్మకంగా గుర్తించిన పసలపూడి, మొగలి కుదురు, కొత్తపేట పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 19,217 విద్యా ర్థులకు పరీక్షలు రాయనున్నారని వీరి కొరకు 110 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపా రు.

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - రాజోలు


సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్

రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రహదారిని శనివారం రాజోలు ఎంఎల్ఎ ప్రారంభించి మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో రోడ్ల మరమ్మతులు చేపట్టకుండా రహదారులను గోతులమయం చేసిందని విమర్శించారు. ఐదేళ్లలో కేవలం మరమ్మతులకు తక్కువ నిధులు ఖర్చు చేశారని, దీని వల్ల చిన్నచిన్న గోతులు వర్షా కాలంలో పెద్ద గోతులుగా మారిపోయాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజోలు నియోజకవర్గంలో రహదారులకు మహర్దశ వచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫ్యాడ్ డైరక్టర్ జి.పెదకాపు, సర్పంచ్ సిహెచ్.హెలీనా, కార్యదర్శి డి.సీతా రాముడు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - ముమ్మిడివరం


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ సుబ్బరాజు

అధ్వాన స్థితిలో ఉన్న మారుమూల ప్రాంతాలకు సైతం రహదారుల నిర్మాణానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుంది ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 3వ వార్డు ప్రాంతమైన కాశి వాని తూము సెంటర్ నుంచి చింతల మెరక వెళ్ళే రహదారిని రూ.25 లక్షల వ్యయంతో నిర్మించే సిసి రోడ్డు, అలాగే 19వ వార్డు ప్రాంతమైన మట్టాడి పాలెం రహదారిని రూ.25 లక్షల వ్యయంతో నిర్మించే సిసి రోడ్డుకు ఆదివారం ఎంఎల్ఎ సుబ్బరాజు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ లాడ్స్ ద్వారా మంజూరైన రూ.50 లక్షలను ప్రజా రవాణా సౌకర్యాలను మెరుగుపర్చడానికి వెచ్చిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, ములపర్తి బాలకృష్ణ, గుత్తుల సాయి, చెల్లి అశోక్, నగర పంచాయతీ కమిషనర్ రవివర్మ, ఎఇ.సుధాకర్ లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఇటీవల క్రివాని రేవు గ్రామంలో విద్యుత్ షాక్ గురై మృతి చెందిన రేకాడి ధనకుమారి కుటుంబ సభ్యులను ఆదివారం ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పరామర్శించారు. మండలంలోని క్రివానిరేవు గ్రామంలో మృతురాలి భర్త కనకరాజు, మామగారు రాంబాబులను పరామర్శించి వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చెల్లి అశోక్,గుత్తులు సాయి, కుంచె ప్రసాద్, మట్టా రాహుల్, చింతా నాగముణింద్రావు, మోర్తా అప్పారావు, పెన్నాడ నాగబాబు, పలువురు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఆందోళన

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఇటీవల ఏలూరులో జరిగిన బస్సు ప్రమాదం లో మరణించిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ద్రాక్షారామ యానాం సెంటర్ లో రమణ టూర్స్ అండ్ ట్రావెల్స్ కు చెందిన బస్సును నిలిపి వేసి ఆదివారం రాత్రి ఆందోళన చేపట్టారు. బస్సు ప్రమాదం లో కాజులూరు మండలానికి చెందిన జుత్తుక భవాని మృతి చెందగా, ద్రాక్షారామకు చెందిన మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బాధితకుటుంబాలకు ప్రయివేట్ బస్ యాజమాన్యం ఎటువంటి నష్ట పరిహారం చెల్లించ కుండా నిర్లక్ష్యం గా వ్యవహరించడం పై బాధిత కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రావెల్స్ కు చెందిన బస్సు యానాం నుంచి హైదరాబాద్ బయలు దేరగా ద్రాక్షారామలో బాధిత కుటుంబాలు బస్ నిలిపివేసి మృతురాలి ఫ్లెక్సీతో ఆందోళన చేపట్టారు. వీరి ఆందోళనకు జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్ర శేఖర్, ఇతర జనసేన నాయకులు మద్దతు తెలిపారు. ఆందోళన సమయంలో బస్ లో మద్యం బాటిల్ లభించడం తో డ్రైవర్లు మద్యం సేవించి బస్‌లు నడుపుతూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారంటు ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు అన్ని సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం రాత్రి 11.40 గంటల ప్రాంతంలో ఆకస్మికంగా ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండడంతో ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రాష్ట్రంలోని పలుచోట్ల ప్రభుత్వాసుపత్రులపై విమర్శలు వస్తుండడంతో మంత్రి సుభాష్ ఏరియా ఆసుపత్రిని అకస్మికంగా పరిశీలించారు. ప్రభుత్వాసుపత్రులకు పేదలే అధికంగా వైద్యం కోసం వస్తారని, అటువంటి వారికి పూర్తిస్థాయిలో వైద్యం అందించాల్సిన కనీస బాధ్యత వైద్యులపై ఉందన్నారు. అన్ని సమయాల్లోనూ వైద్యులు అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

అమరజీవి సేవలు చిరస్మరణీయం


కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - యంత్రాంగం

అమరజీవి పొట్టి శ్రీరాముల సేవలు చిరస్మరణీయమని పలువురు అన్నారు. జిల్లాలో పొట్టి శ్రీరాముల జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అమలాపురం: భాషా ప్రయుక్తరాష్ట్రాల ఏర్పాటు కోసం అమ రజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీ యమని కలెక్టర్ కార్యాలయ పరిపాల నాధికారి కడలి కాశీ విశ్వేశ్వరరావు పే ర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ నందు అమరజీవి పొట్టి శ్రీరాములు125 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయ పరిపాల నాధికారి కడలి కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సంద ర్భంగా విశ్వేశ్వరరావు మాట్లా డుతూ పొట్టి శ్రీరాములు త్యాగం ఎనలేనిదన్నారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ఆయన చేసిన కషి చిర స్మరణీయమని కొనియా డారు. ఆయన పోరాట పటిమను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాల న్నారు. అమరజీవి పొట్టి శ్రీరా ములు ఆశయ సాధన కోసం అందరం పునరంకి తమవుదామన్నారు.కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది కృష్ణ కాంత్, శేఖర్ ప్రదీప్, జి.రాజు తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట:** ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని వాడపాలెం లో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల కంఠంశెట్టి శ్రీనివాస్, సాదే శ్రీనివాస్, మెర్ల గోపాలం, విల్లా మారుతి, బీరా ఇసాక్, గనిశెట్టి వీరేష్, కాస సాగర్, ముద్రగడ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం.** ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవి అని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం కొనియాడారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా భీమనపల్లిలో ఆదివారం రామం ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు వరదా రాము, మునికోటి సూరిబాబు, కంకటాల సత్యనారాయణ, మునికోటి శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొత్తపేట ఎంఎల్ఎ సత్యానందరావు

21 నుంచి విజ్ఞాన విహారయాత్ర

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ సెకండరీ గ్రేడ్ పాఠశాలలకు చెందిన సుమారు 116 మంది విద్యార్థులు,15 మంది ఉపాధ్యాయుల బృందం జిల్లా సైన్స్ అధికారి ఆధ్వర్యంలో మార్చి 21 నుంచి 23 వరకు విద్యా విజ్ఞాన విహార యాత్రను నిర్వహిస్తున్నామని జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రమణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు విద్యా విజ్ఞాన విహార యాత్రలు దోహదం చేస్తాయన్నారు. ఈ విద్యా విజ్ఞాన విహార యాత్రను కలెక్టరెట్ కార్యాలయం వద్ద కలెక్టర్ మహేష్ కుమార్ జెండా ఊపి ప్రారంభిస్తారన్నారు.ఈ విహార యాత్రలో భాగంగా తిరుపతి ఐఐటి, తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్, ఏతు ప్రదర్శన శాలలు, వెటర్నరీ విశ్వ విద్యాలయం, చంద్రగిరి కోట, తూర్పు, పశ్చిమ గోదావరి పరివాహ ప్రాంతం, కోరింగ అభయారణ్యం, యానాం కేంద్ర పాలిత ప్రాంతం తదితర ప్రాంతాల్లో ఈ విహార యాత్ర సందర్శన ఉంటుందన్నారు. ఈ విహార యాత్రలో విద్యార్థుల సౌకర్యార్థం ప్రతి 10 మంది విద్యార్థులకు ఒక గైడ్ టీచర్, ప్రతి 10 మంది బాలికలకు ఒక మహిళ గైడ్ టీచర్, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణలో హాజరు నమోదు తో పాటు తల్లిదండ్రుల అనుమతి పత్రంతోనే విద్యార్థులను విహారయాత్రకు తీసుకు వెళ్లడమే కాకుండా, మండల విద్యా శాఖాధికారులు ఎప్పటికప్పుడు పర్యటనను పర్యవేక్షించే సదుపాయాలతో పాటు అవసరమైనప్పుడు సంప్రదించేందుకు డి.ఎస్.ఒ సుబ్రమణ్యం సెల్ నెం. 96401 88525 ,ఎ.ఎం.ఒ రాంబాబు సెల్ నెం.94411 39111 సంప్రదించవచ్చునని తెలిపారు.

అయినాపురం రోడ్డును ఆధునికీకరించాలని డిమాండ్

ప్రజాశక్తి - ముమ్మిడివరం


పాల్గొన్న రోడ్డు సాధన సమితి నాయకులు, గ్రామస్తులు


అధ్వానంగా ఉన్న ముమ్మిడివరం - కాట్రేనికోన ఆర్‌అండ్‌బి రోడ్డు ఆధునికీకరణ పనులను వెంటనే చేపట్టాలని రోడ్డు సాధన సమితి డిమాండ్ చేసింది. అయినాపురం పంచాయతీ పరిధిలోని స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో అయినా పురం సర్పంచ్ మోకా రామారావు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముమ్మిడివరం - కాట్రేనికోన రహదారి పై రాకపోకలు సాగించే గ్రామాలైన సోమిదేవరపాలెం, సూరాయి చెరువు, అయినాపురం గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులు రోడ్డు సాధన సమితి నాయకులు ఈ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి 2019లో నిధులు మంజూరైన ఇప్పటి వరకు ఆధునీకరణ చేపట్టకపోవడం పట్ల వారు తీవ్ర అసంతప్తి వ్యక్తం చేశారు. అయినాపురం రోడ్డు అధ్వాన్నంగా మారటం వల్ల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సమావేశంలో పాల్గొన్న కొందరు పరిస్థితిని ఎంఎల్ఎ దష్టికి తీసుకెళ్లి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో బొంతు నాగరాజు , మట్ట సత్తిబాబు, రెడ్డి నాని, ఉంగరాల కుమార్, అయ్యల రమేష్, సానబోయిన చంటి , సలాది సూరిబాబు, సలాది త్రినాథరావు లతో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈనెల 17 సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్లోని గోదావరి భవన్‌లో నిర్వహిస్తారని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయితో పాటు డివిజన్, మండలం, మున్సిపల్ స్థాయిలో కూడా ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజనల్ అధికారుల కార్యాలయాలలో నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ స్థాయి అధికారులు అందరూ సంబంధిత రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయాలలో పాల్గొంటారన్నారు. మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికకార్యక్రమం సంబంధిత మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహిస్తారని ఈ కార్యక్రమంలో సంబంధిత మండల తహశీల్దార్లు, మండల అభివద్ధి అధికారులతో పాటు మండల స్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా ఈకార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

కార్టూ'నిజం'



అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి- రాజోలు


అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎంఎల్ఎ తదితరులు

రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బిఆర్. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ అన్నారు. శివకోటి గ్రామంలో శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఎంఎల్ఎ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం స్థానిక సర్పంచ్ నక్కా రామారావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ మాట్లాడారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పేదల అభివృద్ధి కోసం పాటుపడ్డారని, పేదలకు ఆయన చేసిన కషి మరువలేనిదని తెలిపారు. ప్రపంచంలోని మేధావులలో కెల్లా గొప్ప మేధావి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని పేర్కొన్నారు. ఆయన రచించిన రాజ్యాంగాన్ని చూసి ఇతర దేశాల వారు అభినందించారని, అలాంటి వ్యక్తి మన దేశానికి చెందిన వారు కావడం మనందరికీ గర్వకారణమని ఎంఎల్ఎ తెలిపారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ అంబేద్కర్‌కు ఎన్ని అడ్డంకులు ఎదురైనా తాను నమ్మిన సిద్ధాంతాన్ని విడిచిపెట్టలేదని చెప్పారు. ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ పాముల రాజేశ్వరి, ఎంపిపి కేతా శ్రీనువాస్, డాక్టర్ రాపాక రమేష్ బాబు, రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, వైస్ ఎంపిపి పొలమూరి శ్యాంబాబు, సి పిఎం నాయుకులు పీతల రామచంద్రరావు, బళ్ల రత్నరాజు, తెన్నేటి కిషోర్, రావి విజయ్, బత్తుల మురళీకష్ణ పలువురు పాల్గొన్నారు. .

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం


ఉప్పలగుప్తంలో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ చిన్నవరాజు

ఉప్పలగుప్తం పంచాయితీ పెద్దూరులో ఆదివారం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక సర్పంచ్, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి చోట సిసి రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నట్టు అన్నారు.గ్రామంలో మిగిలి ఉన్న రోడ్లను దశలవారీగా అభివృద్ధి చేయనున్నట్టు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ వార్డు సభ్యులు ప్రసాద్, కనక లక్ష్మీ, వీర దుర్గారావు, జనసేన నాయకులు చిక్కం సూర్య మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపిపిగా అరుణ నియామకం

ప్రజాశక్తి - కాట్రేనికోన



సమావేశంలో పాల్గొన్న ఎంఎల్ఎ సుబ్బరాజు తదితరులు

స్థానిక మండల ప్రజా పరిషత్ తాత్కాలిక అధ్యక్షులుగా కందికుప్ప ఎంపిటిసి సభ్యురా లు ఏడిద అరుణ నియమితులయ్యారు. ఆదివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధ్యక్షులుగా అరుణచే ఎంపిడిఒ వెంకటాచలం తొలి సంతకం చేయించారు. ఆమె అధ్యక్ష స్థానంలో ఆశీనులయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఇటీవల అనారోగ్యంతో మతి చెందిన మండల పరిషత్ అధ్యక్షురాలు పాలెపు లక్ష్మి చిత్రపటానికి ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, జడ్‌పిటిసి సభ్యులు నేల కిషోర్ కుమార్, ఏడిద చక్రపాణిరావు, సంసాని నాగేశ్వరరావు, ఏడిద సుబ్బారావు ఇతర నాయకులు పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంతాప సూచికంగా కొంతసేపు సభ్యులు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఎంపిపి పాలెపు లక్ష్మి అకాల మతి చెందడం బాధకరమన్నారు. అనంతరం తాత్కాలిక ఎంపిపి అరుణను ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అభినందించారు. ప్రస్తుత వేసవి కాలంలో ప్రజల మంచినీటి సమస్యను తీర్చేందుకు మండల పరిషత్ సభ్యులు, అధికారులు కషి చేయాలన్నారు. అందరికీ అందుబాటులో ఉండి సహకరిస్తానని ఎంఎల్ఎ సుబ్బరాజు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, తాత్కాలిక అధ్యక్షురాలు అరుణలను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు సాన బోయిన నాగేశ్వరరావు, తహశీల్దార్ సురేష్ కుమార్, కాట్రేనికోన, చెయ్యరు కందికుప్ప, గెద్దనపల్లి సర్పంచులు గంటి వెంకట సుధాకర్, చెల్లి సురేష్, చల్లగల వెంకటలక్ష్మి అప్పారావు, దంతులూరి కష్ణంరాజు, నాయకులు నడింపల్లి సూరిబాబు, నల్లా నరసింహమూర్తి, కాశి హనుమంతరావు, బొక్కా రమణ, జగడం బాలయోగి, కాట్రేనికోన, చెయ్యేరు ఎంపిటిసి సభ్యులు మోకా చంద్రనాగరత్నం, గుత్తుల మహాలక్ష్మి, గెద్దాడ గుణ వేణు కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కన్నతల్లిని కడతేర్చిన కుమారుడు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అర్ధరాత్రి వరకు బయట తిరగడం, ఇంటి పట్టున ఖాళీగా ఉంటూ చెడు తిరుగుళ్లు తిరగడం ఎందుకు.. ఖాళీగా ఉండకుండా ఏదో చిన్న పనో, ఉద్యోగం చేసుకోమన్న కన్నతల్లిపై ముఖంపై పిడి గుద్దులు కురిపించడంతో ఆ మాతృమూర్తి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ దారుణ ఘటన ఆదివారం ఎస్.అచ్చుతాపురంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే కాకినాడ 48వ డివిజన్ ఎస్.అచ్చుతాపురం పెంతెకొస్తు చర్చి వెనకాల శ్రీ సాయి నిలయం అపార్టుమెంట్‌కు చెందిన షేక్ జహరా బీబీ (48) కరణంగారి సెంట ర్‌లో ఇడ్లీ పిండి అమ్ముతుంది. భర్త ఖాదర్ భాష, మరో కుమారుడు పెయిం ట్ పనిలోకి వెళ్తుంటారు. ఇందులో పెద్ద కుమారుడు షేక్ షబీర్ కమల్ బీటెక్ మధ్యలో ఆపేసి ఏపనీ చేయకుండా అర్ధరాత్రి వరకు రోడ్డుపై తిరుగుతుంటాడు. మద్యం తాగడం, డబ్బుల కోసం తల్లిని వేదిస్తూంటాడు. ఖాళీగా ఉండే బదులు ఏదో పని చేసుకోవాలని తల్లిదండ్రులు రోజు కుమారుడు షబీర్ కమల్‌ను సూచిస్తూంటారు. ఆదివారం మధ్యాహ్నం తల్లి ఇంటి వద్ద ఉండగా కుమారుడు షేక్ షబీర్ వచ్చి తల్లిని డబ్బులు అడిగాడు. డబ్బులు ఇచ్చేందుకు ఆమె నిరాకరించింది. పని చూసుకోమన్నందుకు కోపోద్రోకానికి గురై వెంటనే తల్లి ముఖంపై పిడి గుద్దులు కురిపించడంతోపాటు, కుక్కర్ మూతతో తలపై కొట్టడంతో కుప్పకూలిపోయింది. తలపై తీవ్రగాయం కావడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. మతుడు అక్కడ నుంచి బయటకు వెళ్లిపోయాడు. మతురాలి భర్త ఫిర్యాదు మేరకు సిఐ డిఎస్.చైతన్యకృష్ణ, ఇంద్రపాలెం ఎస్ఐ ఐ.వీరబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిజిహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోడలిపై అత్త దాడి .. కేసు నమోదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని కందుల పాలెం గ్రామంలో బొడ్డు ఉమామహేశ్వరి అనే మహిళపై ఆమె అత్త సత్యవతి దాడి చేసి గాయపరిచిందని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇవి.. కందుల పాలెం గ్రామ చెందిన ఉమామహేశ్వరి తన భర్త కనిపించడం లేదని అత్తను నిలదీసింది. దీంతో అత్త దాడి చేసిందని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోడలు ఉమామహేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమో దు చేసి ఏఎస్ఐ భుజంగరావు దర్యాప్తు చేస్తున్నారు.

కోడలిపై అత్త ఫిర్యాదు

కాకినాడ నుంచి వచ్చిన తన కోడలు మహేశ్వరి మరో ఆరుగురిని తీసుకువచ్చి తనపై దాడి చేసిందని అత్త సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సత్యవతి ఫిర్యాదు పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

నగదు అపహరణపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కె.గంగవరం

మండలంలోని పేకేరు గ్రామానికి చెందిన బత్తుల ప్రసన్నకుమార్ సైబర్ క్రైమ్ లో తాను రూ.2.50 లక్షల నగదు పోగొట్టుకున్నట్లు కె.గంగవరం పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశాడు. తనకు అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి తన పేరుపై ఇన్సూరెన్స్ క్లెయిమ్ ఉందని నమ్మించి క్రెడిట్ కార్డుతో ఫొటొ పంపించాలని కోరాడన్నారు. దీనికి సంబంధించిన వివరాలు పంపించగా రెండు దఫాలుగా తన అకౌంట్ నుండి రూ.2,50 లక్షల నగదు అపహరించినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా దర్యాప్తు చేస్తున్నారు.

ట్రావెల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొత్తపేట

స్థానిక బోడుపాలెం వంతెన వద్ద రోడ్డు పక్కనే పడుకున్న వ్యక్తిని ట్రావెల్ బస్సు ఎక్కడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఎస్ఐ సురేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం.. కొత్తపేట గ్రామం సమితి రోడ్డు వీధికి చెందిన కోనాల రాఘవులు(72)కి కుమార్తె, కుమారుడు ఉన్నారు కుమారుడు వృత్తిరీత్యా లారీ క్లీనర్. కుమార్తెకు వివాహం కావడంతో అత్తవారింటికి వెళ్లిపోవడంతో రాఘవలకు చూసే నాథుడు లేక బోడిపాలెం ఆంజనేయ స్వామి గుడి సమీపంలో తిరుగుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి అమలాపురం వైపు నుంచి వస్తున్న ఒక ప్రయివేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ వేగంగా నడుపుతూ రోడ్డు పక్కన పడుకున్న రాఘవులపై ఎక్కించాడు. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే చనిపోయాడు. ఈ ఘటనపై కుమార్తెఉండవల్లి వెంకటరమణ ఫిర్యాదుమేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

కోడిగుడ్ల లోడ్ కంటైనర్ బోల్తా

ప్రజాశక్తి-గోపాలపురం

తెలంగాణ నుంచి భువనేశ్వర్‌కు కోడిగుడ్ల లోడుతో వెళుతున్న కంటైనర్ గోపాలపురం హైవే రోడ్డులో ఆదివారం అదుపుతప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనరు చిన్నపాటి గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు స్థానికుల సాయంతో కంటైనర్‌ను మిషనరీ ద్వారా లారీను తొలగించారు.

ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని వజ్రకూటం సెంటర్ మీదుగా పశుమాంసాన్ని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం తెల్లవారాజుజామున పాత వజ్రకూటం గ్రామ శివారు కొండ ప్రాంతంలో పశువులను చంపి మాంసాన్ని హైవే ప్రాంతాల్లో ఉన్నా హోటల్స్‌కు సరఫరా చేసేందుకు తరలిస్తుండగా పోలీసులు తనిఖీల్లో పట్టుకున్నారు. మాంసాన్ని రవాణా చేస్తున్న చెందుర్తి గ్రామానికి చెందిన మిరియాల రమేష్, ఆరుగుల తాతయ్య, గండేటి రఘులపైకేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

కోడిపందేలపై దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మన్యంవారిపాలెం గ్రామ శివారున నిర్వహిస్తున్న కోడిపందేలపై ఎస్ఐ రఘునాథరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద రెండు పుంజులు, రెండు కత్తులు, రూ.1020 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'పది' పరీక్షలకు 100 రోజుల ప్రణాళిక

'ప్రజాశక్తి'తో పాఠశాల విద్య ఆర్‌జెడి నాగమణి





ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో పర్యవేక్షణ మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని, పిల్లలను సరైన మార్గంలో పయనింపజేసేందుకు పక్కా ప్రణాళికతో విద్యా వ్యవస్థలో ప్రభుత్వం సమూల మార్పులు తీసుకొచ్చిందని పాఠశాల విద్య రీజనల్ డైరెక్టర్ జి. నాగమణి అన్నారు. ఈ ఏడాది 10వ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా 100 రోజుల ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తి ముఖాముఖిలో పలు అంశాలను వెల్లడించారు.

పదో తరగతి పరీక్షల నిర్వహణ తీరు?

జిల్లాలోని 21 మండలాల్లోని ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపల్, జడ్‌పి హెచ్ఎస్, కెజిబివి, సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ఎపి రెసిడెన్షియల్ పాఠశాలల్లో 18,300 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో బాలురు 8,700 మంది బాలికలు 9,600 ఉండగా బాలురకంటే బాలికలు ఎక్కువ శాతం ఉన్నారు. విద్యార్థి భవిష్యత్తుకు 10వ తరగతి తొలి మెట్టు. ఈ తరుణంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తాం. పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణను అందిస్తున్నాం. ప్రభుత్వం అందించిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసి పరీక్షలకు సన్నద్ధం చేశాం. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సంఖ్య పెంచుతాం. పరీక్షలను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహిస్తాం. పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశాం.

యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారా.?

సమ్మెటివ్ పరీక్షల అనంతరం విద్యార్థులను, పాఠశాలలను, మండలాలను గ్రేడులుగా విభజించాము. ఉదయం 9 గంటల నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యాయి.100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించాం. సబ్జెక్టులు, మండలాల వారీగా సమీక్షలు, తల్లిదండ్రులు సమావేశాలు నిర్వహించాము. డిసెంబరు 1న ప్రారంభించిన ఈ ప్రణాళికను మార్చి 10 వరకూ అమలుచేశాం. విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత, అధికమార్కులు సాధించేలా ఈ ప్రణాళికను ఈనెల 1 నుంచి అన్ని పాఠశాలల్లో అమలు చేశాం. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు స్టేట్ సిలబస్ ఆధారంగానే విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. గతంలో డిసిఇబి ద్వారా ప్రణాళిక రూపొందించి ఇచ్చేవారు. ఈ ఏడాది రాష్ట్రస్థాయిలోనే తయారు చేసిన పరీక్ష ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు అందించనున్నాం.

విద్యార్థులను ఏ విధంగా సన్నద్ధం చేశారు.?

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించే విధంగా విద్యాశాఖ 100 రోజుల ప్రణాళికను అమలు చేసాం. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ 6 పీరియడ్లు, స్టడీ అవర్స్ నిర్వహించాం. స్టడీ అవర్స్ పాల్గొనే ఉపాధ్యాయులకు ప్రత్యేక సిసిఎల్ మంజూరు చేసాం. ప్రతిరోజూ సబ్జెక్ట్ నిపుణులు తయారు చేసిన ప్రశ్నాపత్రాన్ని ఆన్‌లైన్‌లో తీసుకుని సంబంధిత విద్యార్థులతో పరీక్ష రాయించాం.



సమావేశంలో మాట్లాడుతున్న బాబురావు

వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేకిస్తూ మాల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేసి, ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అంబేద్కర్ కోనసీమ జిల్లా 22 మండలాల మాల సంఘాల జెఎసి ముఖ్య నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం చల్లపల్లిలో జెఎసి ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు స్వగృహం వద్ద జిల్లా మాల ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం జెఎసి కన్వీనర్ జంగా బాబురావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధిక శాతం ఉన్న మాలలపై కక్షగట్టి మాలలకు వ్యతిరేకంగా ఎస్‌సి వర్గీకరణ చేయడానికి ఉత్సాహం చూపుతోందని ఏకపక్షంగా ఒక వర్గానికి కొమ్ముకాస్తుందని ఆరోపించారు. ఐక్యంగా ఉన్న దళితుల పట్ల సిఎం చంద్రబాబుకు ఎందుకు ఈ కక్ష అని ప్రశ్నించారు. చంద్రబాబుకు మాలలు ఓట్లు వేయలేదని ఉద్దేశపూర్వకంగానే వర్గీకరణకు పావులు కదుపుతున్నార,ని మాలలకు 59 కులాలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి విరుద్ధంగా రాజీవ్ రంజన్ మిశ్రా ఏక సభ్య కమిషన్ నియమించి తప్పుడు సర్వేలు చేయించి ఎస్‌సిల్లో ఉన్న 59 కులాలను ముభ్యపెట్టి వర్గీకరణ చేయడానికి అడుగుల ముందుకు వేస్తుందన్నారు. తక్షణం ఏకసభ్య కమిషన్ రద్దుచేసి త్రిసభ్య కమిషన్ నియమించి న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. పూర్తిస్థాయి కుల గణన చేయకుండా ఎస్‌సిలను వర్గీకరణ చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేసి మాలలంతా ఐక్యంగా రాష్ట్రంలో ఎంఎల్‌ఎల ఇళ్ల ముట్టడి చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో 22 మండలాల ముఖ్య నాయకులు గొల్లపల్లి డేవిడ్ రాజు,నెల్లి లక్ష్మీపతి, గెడ్డం సురేష్ బాబు, రేవు తిరుపతిరావు, పొలమూరి మోహన్ బాబు, కోట రామ్మోహన్ రావు, బత్తుల మురళి, సాధనాల వెంకటరావు, బడుగు జేమ్స్ పాల్, రవ్వ భూషణం, పులిదిండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

భీమనపల్లిలో గల షిరిడి సాయి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు మాజీ జడ్‌పిటిసి మాజీ సభ్యుడు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఎంపిపిటిసి సభ్యురాలు నాగరత్న కుమారి దంపతులు కుటుంబ సభ్యులు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అరిగెల నానాజీ,రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం నాయకులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గం

యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - అమలాపురం

స్తానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ముందుగా అమలాపురం యాదవ సంఘం అధ్యక్షులు కైల శోభనబాబు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వేసవి సందర్భంగా అమలాపురం గవర్నమెంట్ హాస్పిటల్ లో రక్త నిల్వలు లేకపోవడం తో బ్లడ్ సెంటర్ సిబ్బంది కోరిక మేరకు ఆదివారం అమలాపురం యాదవ సంఘం అధ్యక్షులు శోభనబాబు పిలుపుతో ఓడలరేవు యాదవ యూత్ అధిక సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు మట్ట రాంబాబు, తానింకి అంజి, మందపాటి వీరబాబు, గొర్ల బాబి బ్రదర్స్, బూర సతీష్ బ్లడ్ సెంటర్ సిబ్బంది దొడ్డా కాశీ, చొల్లంగి రాజ శేఖర్ ,యెల్లమిల్లి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా యాదవ సంఘం నూతన కార్యవర్గం సమావేశంఅమలాపురంలో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న యాదవులకు జనాభా ప్రాతిపదికన రాజకీయ రంగంలో యాదవులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో గౌరవాధ్యక్షులుగా కోరశిఖ వీర వెంకట సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు బర్ల శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులు మందపాటి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గుండుమేను ప్రసన్న మణికంఠ స్వామి, సంయుక్త కార్యదర్శి సూరిబోయిన సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ పాశం చింతారావు, జిల్లా యువజన అధ్యక్షులుగా మందపాటి బాలు యాదవ్, మహిళా అధ్యక్షురాలిగా చేకూరి లక్ష్మి ఎన్నిక అయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ పెద్దలు యువత పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్ష చేస్తున్న గ్రామస్తులకు జనసేన సంఘీభావం


ప్రజాశక్తి -అల్లవరం

ఓడలరేవు గ్రామం లో స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించ లేకపోవడం, సిఎస్ఆర్ నిధులు సక్రమంగా వాడకపోవడం, గ్రామాభివృద్ధి చేయని, చమురు సంస్థల నిర్లక్ష్యం వైఖరికి వ్యతిరేకంగా ఓఎన్జిసి టెర్మినల్ వద్ద గత 13 రోజులుగా గ్రామస్తులు రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. వీరికి అల్లవరం మండల జనసేన పార్టీ తరపున వారికి ఆదివారం సంఘీభావం తెలపారు. ఈ కార్యక్రమంలో అల్లవరం మండల జనసేన పార్టీ నాయకులు కంకిపాటి వీరబాబు, చాట్ల. మంగతాయారు కటారి సుబ్బారావు, జనసేన పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు,కమిడి. గంగాభవాని, వర్రే సూరిబాబు, వీర్ల గణేష్, చిలకలపూడి. వెంకటరమణ, వంగా నాయుడు, గోళ్ళ కమల, యాటి గోపాలం, నార్ని సదా, నార్ని గంగరాజు , కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో బెంబేలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మార్చి నెల మొదటి వారం నుంచి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో ప్రయాణికులు సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి భానుడి భగభగలు మొదలవుతున్నాయి. ఇప్పటికే తెలంగాణలో 42 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా ఆంధ్రప్రదేశ్లోనూ 35 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గోదావరి జిల్లాలోనూ క్రమక్రమంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో మధ్యాహ్నం రోడ్లన్నీ కర్ఫ్యూ వాతావరణం తలపిస్తున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు జనసంచారం అంతంత మాత్రమే ఉంటుంది. ప్రయాణికులు ఎండలు వేడికి తట్టుకోలేక ప్రయాణాలు వాయిదాలు వేసుకుంటున్నారు. మరోవైపు పెళ్లిళ్ల సీజన్ కావడంతో తప్పని పరిస్థితుల్లో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. మధ్యాహ్నం ప్రయాణం చేసేవారికి వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుందని అధిక నీరు తీసుకోవడంతో పాటు తగు జాగ్రత్తలు వహించాలని వైద్యులు వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రానున్న నాలుగైదు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ ప్రకటించింది. మధ్యాహ్నం సమయాల్లో ప్రయాణాలు వాయిదా వేసుకోవడం మంచిదని ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



మధ్యాహ్నం రెండు గంటలకు జనసంచారం లేని ద్రాక్షారామ మెయిన్ రోడ్డు

పుచ్చకాయలకు పెరుగుతున్న డిమాండ్

- మార్కెట్లలోకి పెద్ద ఎత్తున దిగుమతి
- పెరిగిన అమ్మకాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

వేసవి దాహం తీర్చేందుకు పుచ్చకాయ ను అధిక శాతం జనం వినియోగిస్తుంటారు. అధిక శాతం నీరు గల పుచ్చకాయ వేసవిలో దాహం తీర్చే నేస్తంగా ప్రజలు భావిస్తారు. ప్రస్తుతం వేసవి సీజన్ మొదలు కావడంతో మార్కెట్లలో పెద్ద ఎత్తున పుచ్చకాయలు దిగుమతి అవుతున్నాయి. ఈజిప్ట్‌లో పుట్టిన పుచ్చకాయ నేడు ప్రపంచంలో అన్ని దేశాల్లోనూ విరివిగా పండుతోంది. భారతదేశంలో ప్రజలు అధిక శాతం పుచ్చకాయను వినియోగిస్తుంటారు. పిల్లలు కూడా ఇష్టంగా తినే పనులలో పుచ్చకాయ ఒకటి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో లభించే పుచ్చకాయలు అధిక శాతం తమిళనాడు నుంచి దిగుమతి అవుతున్నాయి. తెలంగాణలోని పలు ప్రాంతాల్లోనూ పుచ్చకాయలు పండిస్తారు. గత ఏడాది వరకు ఉంగుటూరు, సింగూరు, నల్లజర్ల, దుంపలపూడి, తదితర ప్రాంతాల నుండి, కొంతమేర చిత్తూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల నుండి పుచ్చకాయలు విరివిగా పండించేవారు. ప్రస్తుతం తెలంగాణలో పండించే పుచ్చకాయలకు అంత డిమాండ్ లేకపోవడంతో పాటు ఎక్కువ కాలం నిలవ ఉండేందుకు తమిళనాడు నుంచి దిగుమతి అవుతున్న పుచ్చకాయలను వర్తకదారులు ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం కేజీ రూ.30 చొప్పున ధర పలుకుతోంది.

మంచి పోషకాలు గల ఆహారం పుచ్చకాయ

పోషకాలు విషయానికొస్తే పుచ్చకాయలో పుష్కలంగా 95 శాతం వరకు నీరు లభిస్తుంది. అందుకనే ఇంగ్లీషులో దీనిని వాటర్ మెలన్ అంటారు. ముదురు ఎరుపు గులాబీ రంగులో లభించే పుచ్చకాయలోని గుజ్జులో బేటా కెరోటిన్లు, పుష్కలంగా లభిస్తాయి. దీంతోపాటుగా విటమిన్ ఏ, విటమిన్ బి6, విటమిన్ సి, పీచు పదార్థం, సుక్రోజు, ఫ్రక్టోజ్, గ్లూకోజ్ లు పుచ్చకాయల లభిస్తాయి.వేసవిలో చెమటలు ఎక్కువగా పట్టిన సమయంలో దాహం తీర్చేందుకు పుచ్చకాయ ఎంతో ఉపయోగపడుతుంది. అధిక నీరు యాంటీ ఆక్సిడెంట్లు పుచ్చకాయలో మెండుగా ఉన్నాయి. కండరాల నొప్పులు ఉన్నవారికి పుచ్చకాయ అమోఘంగా పనిచేస్తుందని నిపుణులు సెలవిస్తున్నారు. 100 గ్రాములు పుచ్చకాయలు 95 శాతం నీరు లభిస్తుంది. ప్రోటీన్ జీరో ప్రోటీన్ జీరో పాయింట్ 0.3 గ్రాములు కొవ్వులు, 0.2 గ్రాములు పీచు పదార్థాలు, 0.4 గ్రాములు. విటమిన్ సి 0.26 గ్రాములు, కెరోటిన్ 126 మైక్రో గ్రాములతో పాటు కాల్షియం, ఫాస్పరస్‌లు పుచ్చకాయల్లో లభిస్తాయి. అందుకనే ఆరోగ్యానికి పుచ్చకాయలు ఎంతో మేలైనవని నిపుణులు భావిస్తారు. పుచ్చకాయతో పొట్టు పుచ్చకాయ గింజలు ఎన్నో ఔషధ గుణాలతో మానవుల ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి. ప్రస్తుతం మార్కెట్లో విరివిగా లభిస్తున్న పుచ్చకాయలు షాపులు వినియోగదాలతో కిటకిట లాడుతున్నాయి. వృద్ధుల నుంచి చిన్నారుల వరకు పుచ్చకాయను ఎంతో ఇష్టంగా తింటారు..



ద్రాక్షారామంలో పెద్ద ఎత్తున దిగుమత అయిన పుచ్చకాయలు

23వ రోజుకు ఆర్‌టిసి కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం డిపోకి చెందిన డ్రైవర్ ఎస్‌వి.రమణ అక్రమ సస్పెన్షన్ను ఎత్తివేయాలని కార్మికులు చేపట్టిన ఆందోళన ఆదివారం 23వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మిక జెఎసి నాయకులు కె.త్రిమూర్తులు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా టిమ్ డ్రైవర్లను సస్పెన్షన్లు చేయడం ఏమిటని ప్రశ్నించారు. 23 రోజులుగా గేట్ ధర్నాలు, రిలే దీక్షలు నిర్వహిస్తూ, కార్మికులంతా ఎర్ర బ్లాడ్జిలతో విధులకు హాజరవుతూ తమ నిరసనను తెలుపుతున్న యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. 4 రోజులుగా తుని, ఏలేశ్వరం, కాకినాడ డిపోల్లో రిలే నిరహారదీక్షలు జరుగుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం డ్రైవర్ ఎస్‌వి.రమణపై అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన రాష్ట్రవ్యాప్తం అవుతుందని హెచ్చరించారు. ఆదివారం బి.రాజు, బిఎల్‌వి.రమణ దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యుబి.కుమార్, ఎన్‌పి.రావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డిఎస్ఆర్ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

డిఎస్ఆర్ క్రికెట్ టోర్నీ విన్నర్‌గా కోరంగి జట్లు, రన్నర్‌గా గాడిమొగ జట్టు నిలిచాయి. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీలో గాడిమొగ, కోరంగి జట్లు ఉత్సాహంగా తలపడ్డాయి. మూడో స్థానాన్ని సీతారాంపురం జట్టు, నాలుగవ స్థానాన్ని తాళ్ళరేవు జట్టు కైవసం చేసుకున్నాయి. విజేతలకు ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎంఎల్‌ఎ చెల్లి వివేకానంద ట్రోఫీతో పాటు నగదు బహుమతులను అందజేశారు. టోర్నీని నిర్వహించిన టేకుమూడి సత్యనారాయణ ను ఎంఎల్‌ఎ అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుత్తుల సాయి, టేకుమూడి లక్ష్మణరావు, దూళిపూడి బాబి, ముత్యాల జయలక్ష్మి, మందాల గంగ సూర్యనారాయణ, పొన్నమండ రామలక్ష్మి, ఉంగరాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రజల సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని వైసిపి నియోజ కవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దిపాలెంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏ కష్టం వచ్చినా తోడుగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్ల క్రాంతి సుధాకర్, వైస్ ఎంపిపిలు బంకు శ్రీను, లొండ రత్నకుమారి, వైసిపి నాయకులు రామిశెట్టి నాని, దేవ లక్ష్మణ్, గొల్లపల్లి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారులో తనిఖీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో తూనికలు, కొలతలు ఇన్‌స్పెక్టర్ వి.మోహన్ స్థానిక రైతు బజారులో తనిఖీలు నిర్వహించారు. ధరలు, తూనికలు, కొలతలు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే కూరగాయలను విక్రయించాలని ఆదేశించారు. కూరగాయల ధరల పట్టిక ఫ్లెక్స్ రూపంలో బయట గేటు వద్ద ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వినియోగదారులకు, వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం వినియోగదారుల సంఘం అధ్యక్షులు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు బి సూర్యనారాయణమూర్తి, వినియోగదారుల సంఘ సభ్యులు ఎం.భాస్కరరావు, కె.సుధాకర్, పి.సత్యనారాయణ, జివిఆర్.చౌదరి, వి.శ్యామల, కె.లక్ష్మి పాల్గొన్నారు.

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రతీ సోమవారం జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమం నేడు యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ విధిగా ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని ఆదేశించారు. అర్జీదారులు ఈ అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భీమేశ్వర స్వామిని దర్శించుకున్న కేంద్ర మాజీ రక్షణ శాఖ మంత్రి

ప్రజాశక్తి - రామచంద్రపురం

మాజీ కేంద్ర రక్షణ శాఖ మంత్రి మల్లిపూడి మంగపతి పల్లంరాజు ఆదివారం ద్రాక్షారామ లోని మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పిలికారు. భీమేశ్వర స్వామి వారి శివలింగాన్ని, శ్రీ మాణిక్యమ్మ అమ్మవారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఆయన వెంట పలువురు ప్రముఖులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అంతరించిపోతున్న కళలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

సమాజంలో అంతరించిపోతున్న కళలను ఆదరించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిరిపురం నూకాలమ్మ ఆలయ కమిటీ కన్వీనర్ అనపర్తి భాను అన్నారు. సిరిపురం గ్రామానికి చెందిన అర్థం బొబ్బర నూకరత్నం కుటుంబ సభ్యులు సుమారు రూ.17 వేలు విలువ చేసే ఇత్తడి గరగలను ఆలయానికి అందజేశారు.

ఉత్కంఠ భరితంగా ఎడ్ల పరుగు ప్రదర్శన

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని కాపవరం గ్రామంలో ఆదివారం నిర్వహించిన రామలింగేశ్వర రాష్టస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు ఉత్కంఠ భరితంగా జరిగాయి. తొలుత ఎడ్ల ప్రదర్శనను కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), టిడిపి నాయకుడు నిమ్మకాయల రంగనాగ్ ప్రారంభించారు. సీనియర్ విభాగంలో 6 జతలు, జూనియర్స్ విభాగంలో 31 జతలు పాల్గొన్నాయి. సీనియర్స్ విభాగంలో ప్రథమ, తృతీయ స్థానంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన కోరా శ్రుతిచౌదరి ఎడ్ల జతలు నిలిచాయి. ద్వితీయ స్థానాన్ని కాకినాడ జిల్లా ధర్మవరంకు చెందిన జువ్వల సత్తిబాబు ఎడ్ల జత నిలిచింది. జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని సామర్లకోటకు చెందిన పాలచర్ల కళ్యాణ్‌కుమార్ ఎడ్ల జత దక్కించుకుంది. ద్వితీయ, తృతీయ స్థానాలను కాపవరంకు చెందిన కుంచం మనోజ్ ఎడ్ల జత, కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్‌శ్రీ మణికంఠ ఎడ్ల జతలు దక్కించుకున్నాయి. న్యాయ నిర్ణేతలుగా సిద్దా నానాజీ, చేకూరి రామకృష్ణ, మనమల కృష్ణ, కంటే ఫణికుమార్ వ్యవహరించారు. విజేతలకు తుమ్మల రామస్వామి, నిమ్మకాయల రంగనాగ్ బహుమతులు, షీల్డ్‌లను అందజేశారు.

ధనమ్మ మర్రికి యాత్రికుల తాకిడి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని లంక గ్రామమైన కేదార్లంక శివారు వీధి వారి లంకలో ఉన్న ధనమ్మ మర్రికి ఆదివారం యాత్రికులు, పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ధనమ్మ అమ్మవారిని దర్శనానికి సుదూర ప్రాంతాలనుంచి యాత్రికులు కుటుంబ సమేతంగా తరలివచ్చి మొక్కుబడులు చెల్లించారు. పెద్ద వృక్షంలో వెలిసిన ఈ అమ్మవారిని తిలకించేందుకు కపిలేశ్వరపురం మండల ప్రజలు గోదావరి పడవ మార్గం ద్వారా వస్తూ ఉంటారు. అనేక ప్రాంతాలైన రాజోలు, అమలాపురం, గన్నవరం, కొత్తపేట రాజమహేంద్రవరం, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు బోడిపాలెం వంతెన మీదుగా అమ్మవారి దర్శనానికి వచ్చి ఇక్కడే వంటావార్పు చేసుకుంటారు. ధనమ్మ మర్రి వద్ద ఉదయం నుంచి సాయంకాలం వరకు పెద్దలు ,యువకులు పిల్లాపాపలతో సందడి చేశారు. గోదావరి నది తీరం వెంబడి ఆహ్లాదకరమైన ప్రకృతి అందాలను తిలకిస్తూ సంతోషంగా గడిపారు. ఎలాంటి అవాంఛనీయం సంఘనలు జరగకుండా అంగర ఎస్ఐ డి.రవికుమార్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.